క్లుప్తంగా

భీమసింగిలో మెగా వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న మహేంద్ర ఆస్పత్రి వైద్య సిబ్బంది

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో విజయనగరానికి చెందిన మహేంద్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు మహేంద్రగిరి, ప్రశాంతి, తదితర సిబ్బంది 140 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ బాల మురళి, మాజీ సర్పంచ్ పాండ్రంకి సంజీవి,పెద్దలు గేదెల రమణబాబు, మజ్జి హరి,ఎస్.అప్పలరాజు, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సత్కారం



ఎస్ఐ లక్ష్మణరావును సత్కరిస్తున్న వివిధ ఫౌండేషన్‌ల ప్రతినిధులు

గజపతినగరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కె.లక్ష్మణరావును ప్రపంచ మానవ హక్కుల మండలి ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ప్రపంచ మానవ హక్కుల మండలి సౌత్ ఇండియా ప్రధాన కార్యదర్శి సాయికుమార్ ఎస్ఐను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్ఐ చేసిన సేవలను గుర్తించి సాయికుమార్‌తో పాటు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ కార్యదర్శి రేవంత్, అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్, సభ్యులు ముల్లు తాతినాయుడు,ప్రదీప్,సతీష్ ఎస్ఐకి జ్ఞాపిక అందజేసి, శాలువాతో సన్మానించారు.

యోగాతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న యోగా శిక్షకులు గౌతమ్

బొండపల్లి: రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా శిక్షకులు గౌతమ్ అన్నారు. గొట్లాం గ్రామంలోని ఫిరమిడ్ కేంద్రం లో ఆదివారం యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. నేడు ప్రతి ఒక్కరూ తమ వృత్తిలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ తీవ్ర మానసి క ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. దీంతో కొంతమంది వ్యసనాలకు బానిసగా మారుతున్నారని, మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారని చెప్పారు. ఒత్తిడి నుంచి బయట పడడేందుకు, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు రోజూ కొంత సమయం యోగా,ధ్యానం కోసం కేటా యించాలని అన్నారు. ఫిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు,తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



రావివలస జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ దామోదరరావు

చీపురుపల్లి: పట్టణంలోని గాంధీబొమ్మ జంక్షన్, రావివలస జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఎస్ఐ ఎల్.దామోదరరావు, పోలీస్ సిబ్బంది ఆదివారం సాయంత్రం వాహ న తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహనాల పత్రాలను, వాహన చోద కుల లైసెన్స్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన బీమా, ఇతర పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఎలాంటి రికార్డులు లేకుండా ప్రయాణాలు సాగించినా, మద్యం తాగి వాహనాలు నడపినా, నిషేధిత వస్తువులను రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసులు నమోదు చేయడం మాత్రమే కాకుండా ఒక్కోసారి లైసెన్స్ కూడా రద్దు చేస్తామన్నారు.

రైతులే ప్రీమియం చెల్లించాలి

వేపాడ: రబీలో సాగుచేసే పంటలకు పీఎం ఎఫ్‌బీవై పథకంలో భాగంగా బీమా కోసం ప్రీమియం రైతులే చెల్లించాలని వ్యవ సాయ శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ. 540, పెసర పంటకు రూ.300, మి నప పంటకు రూ.300, వరికి రూ.630 ప్రీమియం కట్టాల్సి ఉంటుందన్నారు. అపరాలు, మొక్కజొన్న పంటలకు డిసెంబర్ 15లోగా, వరి పంటకు డిసెంబర్ 31లోగా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. అలాగే వాతవరణ ఆధారిత పంటల బీమా పథకం కింద జీడిమామిడి పంటకు బీమా కోసం ఎకరానికి రూ.1,500 ప్రీమియం ఈనెల 15వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

లక్కవరపుకోట: మండలంలోని లచ్చంపేట గ్రామ సమీపంలోని మద్యం దుకాణం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నవీన్‌పడాల్ ఆదివారం తెలిపారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయించేందుకు ప్రసాద్ అనే వ్యక్తి మద్యం దుకాణం నుంచి 13 మద్యం సీసాలు తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.

మిగులు పనులు పూర్తి చేసేదెప్పుడో..?

- అర్ధంతరంగా నిలిచిన వేపాడ ప్రధాన రహదారి విస్తరణ పనులు
- 16.4 కిలోమీటర్లకు 11 కిలోమీటర్ల మేర పూర్తయిన తారురోడ్డు పనులు
- పెండింగ్‌లో 2.4 కిలోమీటర్ల తారు రోడ్డు, 3 కిలోమీటర్ల సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం
- ఇబ్బందిపడుతున్న రహదారి పరిధిలోని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు



వేపాడలో మెట్లు తొలగించడం తో ఇసుక మూటలు వేసుకున్న గృహస్తులు





వేపాడలో రోడ్డుపై గుంతల్లో నిలిచిన వాడుకనీరు



సీతంపేటవద్ద మిక్సింగ్ మెటల్ వేసి తారురోడ్డు వేయకుండా వదిలేసిన దృశ్యం

వేపాడ: మండల ప్రధాన రహదారి విస్తరణ పనులు చివరిదశలో నిలిచిపోయాయి. మండలంలోని సోంపురం వయా వేపాడ మీదుగా అనకాపల్లి జిల్లాలోని ఆనందపురం జంక్షన్ వరకు సుమారు 16.4 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్‌డీబీ నుంచి రూ.22 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు విస్తరణలో భాగంగా శ్లాబ్, పైపు కల్వర్టుల నిర్మాణం తో పాటు 11 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం పూర్తి చేయగా, మరో 2.4 కిలోమీటర్ల పనులు చేయాల్సి ఉంది. ఈ రోడ్డులో ఉన్న వేపాడ,వల్లంపూడి, ఆకులసీతంపేట, సోంపురం, అరిగిపాలెం, సోంపురం జంక్షన్ ప్రాంతాల్లో 3 కిలో మీటర్ల మేర సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాల్సి ఉంది. పనులు జోరుగా సాగుతున్న సమయంలోనే ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వేపాడలో రోడ్డు విస్తరణ కో సం అధికారులు మార్కింగ్ ఇచ్చి రోడ్డును ఆనుకుని ఉన్న ఇళ్లలో కొంతభాగాన్ని, ముందు ఉన్న మెట్లను అప్పట్లోనే తొలగించేశారు. మెట్లు లేక ఇళ్లలోకి వెళ్లేందుకు వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఇసుక బస్తాలనే మెట్లుగా వేసుకున్నారు. వేపాడతో పాటు మిగతా గ్రామాల్లోనూ రహదారి విస్తరణలో భాగంగా పాత కాలువలను పూడ్చేశారు. కొత్తగా సైడ్ కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్లలోని వాడుక నీరు బయటకు పోయే మార్గం లేక రోడ్డుపై గుంతల్లో నిలిచిపోతోంది. భర్తవానిపాలెం, వల్లంపూడి కల్లాల సమీపంలోని కల్వర్టులవద్ద పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి అయిదు నెలలు పూర్తవుతున్నా మిగిలిపోయిన ఈ పనులను పూర్తిచేయాలనే ఆలోచన అధికారులు, పాలకులు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల అధికారులు నిత్యం ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తున్నా ఏ అధికారి కూడా పట్టించుకోకపోవడం శోచనీయం. అధికారులు, పాలకులు స్పందించి రహదారి విస్తరణ, సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, ఆరహదారి పరిధిలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



రోడ్డు విస్తరణ అంటూ మార్కింగ్ ఇచ్చి ఇంటిలో కొంత భాగాన్ని తొలగించారు. మెట్లు పూర్తిగా తొలగించేశారు. మా ఇంట్లో వృద్ధులు ఉన్నారు. మెట్లు లేకపోవడంతో వారు ఇంట్లో నుంచి బయటకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సైడు కాలువలు నిర్మించి పలకలు అమర్చితే వాటిపై మెట్లు నిర్మించుకుంటాం. కాలువలు లేకపోవడంతో మురుగు నీరు ఎక్కడిదక్కడే నిలిచిపోతోంది. కనీసం కాలువలైనా నిర్మిస్తే కొంత సమస్య తీరుతుంది.

– నెక్కల రమణమ్మ, వేపాడ

పట్టించుకోవడం లేదు



రోడ్డు విస్తరణ అంటూ మార్కింగ్ ఇచ్చి హడావుడిగా ఇళ్లను కొట్టేశారు. సీసీ రోడ్డు, సైడు కాలువలు నిర్మించాల్సి ఉంది. ఎన్నికలకు ముందు ఆగిపోయిన పనులను నేటికీ ప్రారంభించ లేదు. మా సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు. మండల అధికారులు నిత్యం ఈ రహదారిలోనే విధులకు వస్తుంటారు. వారికి సమస్య కనిపించడం లేదా..? ఇప్పటికైనా అధికారులు సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి పనులు పూర్తి చేయించేలా కృషి చేయాలి.

– నిరుజోగి నాయుడు, వేపాడ

ఆర్థిక సహాయం



రమణ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చీపురుపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ కుటుంబానికి లయన్స్, లయన్స్ స్టార్స్ క్లబ్‌లు సంయుక్తంగా రూ.30 వేల ఆర్థిక సహాయం చేశాయి. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, బెల్లాన వంశీకృష్ణ, ఎస్.రాధాకృష్ణ, డి.సీతారామ రాజు, బి.వి.గోవింద రాజులు ఆదివారం రమణ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమణ చిన్న వయస్సు నుంచే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఎంతో ఉపయోగపడ్డారని, గ్రామాల్లో మొబైల్ లైబ్రరీ, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ, మొక్కలు పంపిణీ చేస్తూ తక్కువ వయస్సు లోనే ఎంతో గొప్ప పేరు తెచ్చుకుని చీపురుపల్లికి గర్వ కారణంగా నిలిచాడన్నారు. రమణ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన వ్యక్తి పొట్నూరు సురేష్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. సురేష్ తనకుమారుడితో కలిసి బైక్‌పై ఎస్.కోట మండలం, గౌరమ్మపేటలోని అత్తవారి ఇంటికి వెళ్లి తిరిగి పెదవేమలి వస్తుండగా రామభద్రపురం వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడం తో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఆయన్ని విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 41 దరఖాస్తులు

మెరకముడిదాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కోసం ఈనెల 6వ తేదీ నాటికి మండలంలో 41 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ అజూ రఫీజాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ తర్వాత కొన్ని దరఖాస్తులు వచ్చాయని, ఈవిషయాన్ని ఎన్నికల అధికారు లు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఈవిషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని సూచించారు.

అయ్యప్ప స్వాముల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న అయ్యప్ప దీక్షాధారులు

శృంగవరపుకోట: స్థానిక శ్రీనివాసకాలనీలో ఉన్న శ్రీ మణికంఠ ధర్మశాస్త్ర పీఠానికి చెందిన అయ్యప్ప స్వామి మండల దీక్షాధారులు తమ దీక్షలో భాగంగా ఆదివారం భిక్షాటన చేశారు. ఉదయం 6గంటల సమయంలో భజనలు చేస్తూ, శరణుఘోష చెబుతూ ఇంటింటికీ వెళ్లి భిక్షం సేకరించారు.మహిళలు స్వాములకు కాళ్లు కడిగి అన్నసమారాధనకు కావాల్సిన సామగ్రిని భిక్షగా స్వాములకు సమర్పించారు. గురుస్వామి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ పీఠంలో ప్రతీ సంవత్సరం ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భిక్షాటన ద్రవ్యాలతో సోమవారం పంబావద్ది నిర్వహించి, తర్వాత అన్నసమారాధన చేస్తామన్నారు. సాయంత్రం 4గంటలకు స్వామి వారి పల్లకీ సేవ ఉంటుందని, పట్టణంలోని ఇతర పీఠాల స్వాములు కూడా హాజరు కావాలని కోరారు.

గజపతినగరం కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా దుర్గాప్రసాద్



దుర్గా ప్రసాద్

గంట్యాడ: గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా చిత్ర దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాష్ట్రంలోని 50 నియోజకవర్గాలకు ఆదివారం కో-ఆర్డినేటర్లను నియమించింది. అందులో భాగంగానే గజపతినగరం నియోజకవర్గానికి దుర్గాప్రసాద్‌ను నియమించారు.

ప్రమాదకరంగా వంతెనలు



అలమండ వంతెనపై విరిగిపోయిన సైడ్ గ్రిల్స్



భీమసింగి వద్ద గోస్తనీనదిపై రక్షణ గోడలు లేని కాజ్‌వే

జామి: మండలంలోని పలు వంతెనలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. కొన్ని వంతెనలు నిర్మించి దశాబ్దాలు కావస్తుండడంతో గతంలో వాటిని పరిశీలించిన ఇంజినీర్ల బృందం అవి వినియోగానికి పనికి రావని తెలియజేశారు. అలమండ-భీమసింగి వంతెన బ్రిటిష్ కాలంలో నిర్మించారు. ఈవంతెనపై ఇరువైపులా రక్షణగా ఏర్పరచిన ఐరన్ గ్రిల్స్ తుప్పుపట్టి పాడైపోయాయి. ఈ వంతెనపై కొత్తవ్యక్తులు ఎవరైనా ఆదమరిచి వాహనాలను నడిపితే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అలాగే జామి-ఎస్.కోట వెళ్లే రోడ్డులో జాగరం వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఇరుకు వంతెన కావడంతో భారీ వాహనాలు వచ్చేటప్పుడు మిగతా వాహనాలు పక్కనుంచి తప్పుకునే అవకాశం లేదు. భీమసింగి-వసంత గ్రామం వెళ్లే రోడ్డులో భీమసింగి కాజ్‌వే పరిస్థితి కూడా అంతే. వరదలు వచ్చినప్పుడు ఈవంతెనపై నుంచి గోస్తనీ నది ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. వరద ప్రవాహం వల్ల ఈ వంతెన దెబ్బతింది. వంతెనపై రక్షణ గోడలు, విద్యుత్ దీపాలు లేవు. వాహనచోదకులు రాత్రి సమయంలో ఏమాత్రం అదుపుతప్పినా నదిలో పడిపోయే ప్రమాదం ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనలకు మరమ్మతులు చేయించడంతో పాటు రక్షణ గోడలు నిర్మించాలని, శిథిలావస్థకు చేరుకున్న వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



జాగరం గెడ్డపై శిథిలావస్థకు చేరుకున్న వంతెన

పర్యాటకులు అప్రమత్తం..



పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై దుర్గాప్రసాద్

పూసపాటిరేగ: చింతపల్లి బీచ్‌కు వెళ్లే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని చింతపల్లి బీచ్‌లో ఆదివారం ఆయన పర్యటించి పర్యాటకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సముద్రంలో స్నానాలకు వెళ్లేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం తప్పదని హెచ్చరించారు. కార్తీకమాసం కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నందున మెరైన్, లోకల్ పోలీస్‌లతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పర్యాటకులకు ఎటువంటి ఆపద కలగకుండా 10 మంది గజఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆయనతో పాటు చింతపల్లి మెరైన్ పోలీస్ స్టేషన్ ఎస్సైలు వాళ్లె శ్రీనివాసరావు, స్వీటీ సత్తి, తదితరులు పాల్గొన్నారు.

● అపూర్వ కలయిక



మూడున్నర దశాబ్దాల కిందట చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకే చోట ఆదివారం కలుసుకున్నారు. సంతోషంగా సంబరాలు చేసుకున్నారు. తమ బాల్య జీవితంలో జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. సాలూరు నియోజకవర్గంలోని పాచిపెంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1989 – 90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బొండపల్లిలోని ఓ లేఅవుట్‌లో కలుసుకున్నారు. ఆ బ్యాచ్‌లో చదివిన విద్యార్థులు నేడు తమ కుటుంబాలతో ఒక్కటిగా తరలివచ్చి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమతో చదువుకొని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆర్థికంగా ఆదుకున్నారు. అలనాటి తమ గురువులను సత్కరించి ఉల్లాసంగా గడిపారు. నాటి విద్యార్థులు వై.చిరంజీవిరావు, బి.శ్రీనివాసరావు, పీకేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– బొండపల్లి

సేవలకు గుర్తింపు



జనార్దనరావును సన్మానిస్తున్న అప్పారావు,బాబ్జీ, తదితరులు

గజపతినగరం: ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన తుంపిల్లి జనార్దనరావును పలు స్వచ్ఛంద సేవా సంస్థలు సత్కరించాయి.మాతృభూమి సేవాసంఘం, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విజయనగరంలోని యూత్ హాస్టల్‌లో స్వచ్ఛంద సేవా సంస్థల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని సేవాసంస్థలు సత్కరించాయి. అందులో భాగంగానే జనార్దనరావును సత్కరించారు. ఈయన అత్యవసరంగా రక్తం కావాల్సిన వారికి రక్తం సేకరించి అందిచడం, ఆరోగ్య శ్రీ కార్డులు లేని వారికి కార్డులు ఇప్పించడంతో పాటు పలు సేవలందిస్తున్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ తదితరులు జనార్దనరావును అభినందించారు.

నీటి సంఘాల ఓటర్ల జాబితా ప్రదర్శన



ఎల్.కోట తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న డీటీ రమేష్

లక్కవరపుకోట: మండలంలో త్వరలో నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను డిప్యూటీ తహసీల్దార్ తమటపు రమేష్ తహసీల్దార్ కార్యాలయ నోటీస్ బోర్డులో ఆదివారం ప్రదర్శించారు. మండలంలోని 18 సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన ఓటర్ల జాబితాలను సచివాలయాల నోటీస్ బోర్డుల్లోనూ ప్రదర్శనకు పెట్టామన్నారు. ఈ జాబితాలపై సోమవారం,మంగళవారం రెండు రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరిస్తామని, అభ్యంతరాలను వీఆర్‌ఓలకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని స్పష్టం చేశారు. తుది జాబితాను ఈనెల 13వ తేదీన ప్రదర్శిస్తామన్నారు. అలాగే కొత్తవలస మండలంలోని 9 సాగునీటి సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను ప్రదర్శించినట్లు తహసీల్దార్ బి.నీలకంఠరావు తెలిపారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

చీపురుపల్లి: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 2025 జనవరి 5న విజయవాడలో నిర్వహించ నున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత ధర్మప్రచార సంయోజక్ పాగిరి సూర్యనారాయణ కోరారు. సంబంధిత కరపత్రాలను పట్టణంలోని కొత్తఅగ్రహారం ఆర్యసమాజం ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల సంరక్షణ, స్వయం ప్రతిపత్తి కోసం, దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి ఆలయ కమిటీలను ఏర్పాటు చేసి వాటికి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఉద్యమం ప్రారంభమయ్యిందన్నారు. అందులో భాగంగానే లక్షలాది మందితో హైందవ శంఖారావం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయనగరం విభాగ్ వ్యవస్థా ప్రముఖ్ శివప్రసాద్, జిల్లా కార్యవాహ ఎం.రమణ, చీపురుపల్లి ఖండ కార్యవాహ వి.సతీష్, సహ కన్వీనర్ కె.శ్రీనివాసరావు, ధర్మ ప్రచార కార్యకర్త శంకరరావు, బీజేపీ నియోజకవర్గ కో–కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు, నియోజకవర్గ కన్వీనర్ ఎస్.వి.ఎల్.ఎన్.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వర్మ తదితరులు పాల్గొన్నారు.

కెల్లలో కార్తీక వనసమారాధన



భోజనాలు వడ్డిస్తున్న యువకులు

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో కార్తీక వనసమారాధాన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉసిరి చెట్టు వద్ద గ్రామస్తులు పూజలు చేసిన అనంతరం వన భోజనాలు చేశారు. అయ్యప్ప, శివ మాలధారణ స్వాములు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సహాయం



కనకమహాలక్ష్మి కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎంపీపీ ప్రమీల, అమ్మ సేవా సొసైటీ సభ్యులు

గుర్ల: మండలంలోని పాలవలసకు చెందిన యువతి కోరాడ కనకమహాలక్ష్మి వివాహానికి అమ్మ సేవా సొసైటీ రూ.25 వేల ఆర్థిక సహా యం చేసింది. ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు చేతులు మీదుగా ఆది వారం నగదు అందజేశారు. అమ్మసేవా సొసైటీ సభ్యుడు అల్లం పురుషోత్తమరావు మాట్లాడుతూ కనకమహాలక్ష్మిది పేద కుటుంబం కావడంతో వివాహానికి తమవంతు సహాయం అందించామని చెప్పారు.